# పల్లె నుంచి వైద్య ప్రపంచానికి..





అతనొక సుప్రసిద్ధ రోబోటిక్ సర్జన్. క్యాన్సర్‌తో ముడిపడిన అనేకానేక చిక్కుముడులకు ఆన్సర్ కనుగొన్న జిజ్ఞాసి. ఆయన ముత్తాత గోదావరి జిల్లా వాసి. సంపన్నుడు. సహృదయుడు. చేతికి ఎములేని మహాదాత. తాత తరానికి వచ్చేసరికి ఆస్తులు కరిగిపోయాయి. నిజాం కర్ణాటకలోని నదీతీర గ్రామానికి వలస వచ్చారు. డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి అక్కడే పుట్టారు. అక్కడే పెరిగారు. అక్కడి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నారు. పూరి గుడిసె జీవితం ఆయనది. ''కుండపోత వర్షం మా బతుకుల్లో అతిపెద్ద గండమే. ఇల్లు చెరువైపోయేది. 'దేవుడా వర్షాన్ని ఆపేయవా?'.. అని అమ్మ దేవుణ్ని వేడుకునేది'' అంటూ బాల్య జ్ఞాపకాలను నెమరేసుకుంటారు చిన్నబాబు. నవోదయ విద్యాలయాల పేరుతో మోడల్ స్కూల్స్‌ను స్థాపించాలన్న కేంద్ర సర్కారు నిర్ణయం ఆ రైతు బిడ్డకు వరంగా మారింది. హెడ్‌మాస్టర్ జయప్ప సార్ ప్రోత్సాహంతో ప్రవేశ పరీక్ష రాసి సీటు తెచ్చుకున్నారు. ఇంటర్ స్థాయిలో గణితం, భౌతిక -రసాయనశాస్త్రాలు, జీవశాస్త్రం.. చదివే వెసులుబాటు ఉండేది. దీంతో ఇంజినీరింగ్, మెడిసిన్.. రెండు కోర్సుల్లోనూ చేరే అవకాశం లభించేది. చిన్నబాబుకు ఆ రెండు అవకాశాలూ వచ్చాయి. కానీ తను వైద్యశాస్త్రం వైపే మొగ్గు చూపారు. దావణగెరెలోని జగద్గురు మురుగరాజేంద్ర మెడికల్ కాలేజీలో సీటు సంపాదించారు. అక్కడ చాలా వరకూ విదేశీ కోటాలో సీట్లు తెచ్చుకున్న ప్రవాసుల పిల్లలే. దీంతో ధనిక-పేద తేడాలు కొట్టొచ్చినట్టు కనిపించేవి. ఆ సమయంలో గ్రంథాలయం నేస్తంగా మారింది. ఎంబీబీఎస్ పట్టా చేతికిరాగానే.. ఉన్నత విద్యకు అవకాశాలున్నా ఏదైనా ఉద్యోగం వెతుక్కుని కుటుంబానికి ఆసరాగా నిలబడాలని అనుకున్నారు చిన్నబాబు. కానీ నియామక ప్రక్రియలో అంతులేని జాప్యం ఆ యువకుణ్ని ఆవేదనకు గురిచేసింది. దీంతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయాలని నిశ్చయించుకున్నారు. సూరత్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జనరల్ మెడిసిన్ విభాగంలో సీటు సాధించుకున్నారు. అప్పుడే, జగమొండి వ్యాధి క్యాన్సర్ ఆయన దృష్టిని ఆకర్షించింది. గుజరాత్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో క్యాన్సర్ చికిత్సలో పట్టు సాధించారు. వైద్య సాంకేతికతలో నైపుణ్యం సంపాదించి రోబోటిక్ సర్జన్‌గా పేరు తెచ్చుకున్నారు. ప్రస్తుతం, హైటెక్‌సిటీలోని యశోద హాస్పిటల్‌లో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 'లివ్ ఫర్ ఎ లెగసీ' డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి జీవిత, వృత్తి అనుభవాల సమాహారం. రచయిత అరుణ్ తివారీతో కలిసి ఈ పుస్తకానికి ప్రాణం పోశారు. గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ద్వారా ప్రజల్లో క్యాన్సర్ పట్ల అవగాహన పెంచుతున్నారు డాక్టర్ చిన్నబాబు.




**క్యాన్సర్ ఔషధాల ధరలు సామాన్యులకు అందుబాటులోకి రావాలి. ఏ నిరుపేద రోగీ కూడా మందులు కొనలేని పరిస్థితుల్లో మృత్యువాత పడకూడదు. ఇది మన ఒక్కరి సమస్య కాదు. మూడో ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు. ప్రస్తుతం అరవైకి పైగా క్యాన్సర్ నివారణ ఔషధాలు మార్కెట్‌లో ఉన్నాయి. వాటి ధరలు నేలకు దిగిరావాల్సిన అవసరం ఉంది. భారత ఫార్మా రంగం నాణ్యమైన ఔషధాలకు పేరు. కానీ కీలక మూలకాలను ఇంకా చైనా నుంచే దిగుమతి చేసుకుంటున్నది. ఈ విషయంలో స్వావలంబన సాధిస్తే.. మన ఆశ నెరవేరుతుందేమో.**

**ఎపిడెమియాలజీ.. వ్యాధి మూలాలను పరిశోధించే శాస్త్రం. వైద్య పరిభాషలో చెప్పాలంటే 'రిస్క్ ఫ్యాక్టర్'ను అధ్యయనం చేసే విభాగం ఇది. సంతానలేమి, ఆలస్య వివాహాలు, పిల్లలకు చనుబాలు ఇవ్వకపోవడం.. ఛాతి క్యాన్సర్‌కు ఓ కారణమని గుర్తించింది ఇలాంటి ఓ అధ్యయనం ద్వారానే. ధూమపానం, మద్యపానం మనిషి ఆరోగ్యాన్ని ఎలా దెబ్బ తీస్తాయన్నది గుర్తించింది కూడా ఎపిడెమియాలజీ నిపుణులే. జన్యుశాస్త్రం మరింత అభివృద్ధి చెందాక.. వ్యాధి విశ్లేషణ అటువైపు నుంచీ ఎక్కువగా జరుగుతున్నది.**